క్లుప్తంగా

గ్రామదేవతల సంబరాలపై విస్తృత ప్రచారం



గ్రామ దేవత సంబరాల్లో పాల్గొన్న బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి

దెందులూరు: సనాతన సంస్కృతి సంప్రదాయాలు హిందుధర్మం పరిరక్షణ, అభివృద్ధితో పాటు గ్రామ దేవతల సంబరాలపై విస్తృత ప్రచారానికి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్ట్ బోర్డు కృషి చేస్తుందని బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి అన్నారు. ఆదివారం ఆమె నివాసంలో మాట్లాడుతూ కనకదుర్గమ్మ ఆలయ అభివృద్ధితో పాటు ప్రణాళికాబద్ధంగా హిందూ ధర్మ రక్షణకు చర్యలు, పూజలను నూతన ఆలయ చైర్మన్, బోర్డు తొలి ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఆదివారం గ్రామదేవతల సంబరాలు నిర్వహించామన్నారు. తొలిసారిగా తాను ఆలయ బోర్డు డైరెక్టర్ హోదాలో గ్రామదేవతల సంబరాల్లో పాల్గొనడం వ్యక్తిగతంగా, ఆధ్యాత్మికంగా సంతోషంగా ఉందన్నారు.

ఫాదర్స్ డే వేడుకలు



ఏలూరు పీఠాధిపతి వికార్ జనరల్ ఫాదర్ బాలకు సత్కారం

దెందులూరు: మండలంలో ఆదివారం ఫాదర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యా సంస్థలు, శిక్షణ కేంద్రాల్లో వేడుకలు నిర్వహించారు. సోమవరప్పాడులోని సెయింట్‌జాన్స్ విద్యా సంస్థల్లో ఏలూరు పీఠం వికార్ జనరల్ సెయింట్ జాన్స్ ప్రిన్సిపల్, కరస్పాండెంట్ డాక్టర్ ఫాదర్ పీ. బాలను ఆర్‌సీఎం సంఘస్తులు, కళాశాల అధ్యాపకులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. మానవతా విలువలు పరిరక్షణతో పాటు విద్యా, వైద్య, మౌలిక వసతుల కల్పన, సేవా రంగాల్లో 30 ఏళ్లుగా తండ్రి పాత్రను పోషిస్తూ, ప్రేమను పంచుతూ అందరి మన్ననలు పొందిన ఫాదర్ బాలను సత్కరించడం తమకు ఎంతో సంతోషంగా ఉందని అధ్యాపకులు, సంఘ పెద్దలు అన్నారు. ఈ సందర్భంగా జ్ఞాపికను అందజేశారు.

లారీ బోల్తా



జాతీయ రహదారిపై సోమవరప్పాడు-ఆశ్రం మధ్య బోల్తా పడిన లారీ

దెందులూరు: జాతీయ రహదారిపై సోమవరప్పాడు- ఆశ్రం వద్ద ఆదివారం అదుపు తప్పి లారీ బోల్తా పడింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. జాతీయ రహదారిపై ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ద్విచక్ర వాహనాన్ని తనిఖీ చేసి అవగాహన కల్పిస్తున్న పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ

పెదపాడు: వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పెదపాడు ఎస్సై చల్లా కృష్ణ తెలిపారు. మండలంలోని కలపర్రు టోల్ గేట్ వద్ద ఎస్సై వాహనదారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని వారికి సూచించారు. రోడ్డు ప్రమాదాలు జరిగే విధానం జరిగే ప్రమాదాలను వారికి వివరించారు. తప్పకుండా హెల్మెట్ ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సొసైటీ ఉద్యోగుల ధర్నా

ఏలూరు (టూటౌన్) : సొసైటీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరులోని డీసీసీబీ బ్యాంక్ వద్ద సొసైటీ ఉద్యోగుల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించనున్నట్లు యూనియన్ నాయకులు తెలియజేశారు. ఏపీ సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ధర్నాలో సొసైటీ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాల్సిందిగా జిల్లా కమిటీ ఓ ప్రకటనలో కోరింది.

రైతు విజ్ఞాన కేంద్రాలుగా ఆర్‌బీకేలు

- సత్ఫలితాలిస్తున్న ముఖ్యమంత్రి జగన్ ఆలోచన
- గ్రామాల్లో అన్నదాతలకు అండగా రైతు భరోసా కేంద్రాలు
- విత్తనం నుంచి విక్రయం వరకూ అన్ని రైతు ముంగిటే



పత్తేపురంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

నిడమర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిననాటి నుంచి పాలనలో తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు. దీని భాగంగానే అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో రైతులకు అన్ని రకాల సేవలు అందించేలా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలు అన్ని గ్రామ సచివాలయ పరిధిలో మే 2020 నుంచి ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో ఆరుగాలం కష్టించి అన్నం పెట్టే రైతుకు వెన్నుదన్నుగా ఈ ఆర్‌బీకేలు ఉన్నాయి. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు సరఫరాతోపాటు పండించిన పంటను ప్రభుత్వమే కొనుగోలు చేసేలా రైతు భరోసా కేంద్రాలే కీలక సేవలు అందిస్తున్నాయి. అన్నదాతకు అవసరమయ్యే సేవలన్నీ ప్రభుత్వం ఒకే చోట అందించేలా ఈ ఆర్‌బీకే వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించారు. ఈఆర్‌బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకూ, బీమా నుంచి పంట నమోదు వరకూ అన్ని సేవలు రైతులకు అందడంతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు కేంద్ర బిందువుగా ఆర్‌బీకేలు

విత్తనం, ఎరువులు, పురుగు మందుల అందించడంతోపాటు పండించిన పంటను రైతు ముంగిటే కొనుగోలు చేస్తూ ప్రతి రైతుకు కేంద్ర బిందువుగా ఈ ఆర్‌బీకేలు ఉన్నాయి. ప్రైవేటు వ్యాపారులు, డీలర్ల ఆగడాలకు ఈ ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం చెక్ పెట్టింది. ఈ కేంద్రాల ద్వారా డిజిటల్ ఆధార్ ప్రామాణిక పరికరాలతో కూడిన మల్టీ-పక్షనల్ కీయోస్క్‌లుగా రైతుల అవసరాలు తీరుస్తున్నాయి.

మండలంలో ఆర్‌బీకే సేవలు ఇలా

నిడమర్రు మండలంలో గ్రామ సచివాలయ పరిధిలోని 4,200 మంది రైతులకు సేవలందించేందుకు ప్రభుత్వం 14 ఆర్‌బీకేలు ఏర్పాటు చేసింది. ప్రభుత్వం పంట పెట్టుబడి ప్రోత్సాహంగా అందించే వైఎస్సార్ రైతు భరోసా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తున్నారు. నాలుగేళ్లగా పరిశీలిస్తే 2019-20న రూ.4.57కోట్లు, 2020-21న రూ.4.45 కోట్లు, 2021-22న 4.25 రూ. కోట్లు 2022-23న రూ. 3.91 కోట్లు నేరుగా రైతుల బ్యాంక్ ఖతాల్లోకి జమ చేసారు. ఈ నాలుగేళ్లలో రూ17.10 కోట్లు ఆర్‌బీకే కేంద్రాల ద్వారానే జమ చేసారు. 2020-21 ఖరీఫ్‌లో వచ్చిన తుఫాన్‌లో నష్టపోయిన మండలంలోని 2,305 మంది రైతులకు వైఎస్సార్ పంటల బీమా పథకం కింద రూ 5.03 కోట్లు ఆర్‌బీకేల ద్వారానే అందించారు. 2021లో ఇన్‌పుట్ సబ్సిడీ కింద 1,007 మంది రైతులకు రూ.1.20 కోట్లు రైతులకు ఆర్‌బీకే సిబ్బంది రైతుల ఖాతాల్లో జమ చేసారు. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో 40 శాతం సబ్సిడీలో ఇటీవల 18 పెద్ద ట్రాక్టర్లు, 35 వ్యవసాయ యంత్ర పనిముట్లు, 13 పవర్ టిల్లర్లును రైతులకు అందించారు.



రైతులకు ఎరువులు అందిస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

పెట్టుబడి సాయం అందింది



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక పంటల పెట్టుబడి సాయంగా ఏటా రూ.13.500 చొప్పున నాలుగేళ్లుగా రూ.54వేలు నాఖాతాలో జమ అయ్యింది. గతంలో మాదిరిగా ప్రభుత్వ పథకాల లబ్ధికోసం అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా నేరుగా రైతు భరోసా కేంద్రం ద్వారా మా ఖాతాల్లో జమ అవ్వడం సంతోషంగా ఉంది.

– నాగిశెట్టి సుబ్బయ్య, రైతు బావాయిపాలెం

బీమా రూ.26 వేలు అందాయి



2021లో ఖరీఫ్‌లో వచ్చిన వర్షాలకు దెబ్బతిన్న పంటకు వైఎస్సార్ బీమా పథకంలో రూ.26 వేలు అందాయి. విత్తనాలు ఎంపిక, ఎరువుల యాజమాన్యంలో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతీ పథకం స్థానిక రైతు భరోసా కేంద్రం సేవలు వినియోగించుకుంటున్నాం. ప్రభుత్వమే మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయడంతో దళారుల బాధ తప్పింది.

– దారాబత్తుల సత్రయ్య, రైతు, బావాయిపాలెం

రైతులకు అందుబాటులో సేవలు



గతంలో మండల కేంద్రాల వద్ద మాత్రమే వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండే వాళ్లం, ప్రభుత్వం ఆర్‌బీకేలు ఏర్పాటు చేసాక ప్రతి ఆర్‌బీకేకు ఒక వీఏవోని నియమించింది. మాకు రైతుల నుంచి సహకారం అందించేలా ప్రతీ ఆర్‌బీకేకు చైర్మన్లను నియమించింది. ధాన్యం కొనుగోళ్ల సమయంలో ప్రతి గ్రామంలో టెక్నికల్ సహాయకులు, కంప్యూటర్ ఆపరేటర్లను ప్రభుత్వం నియమించడంతో పూర్తిస్థాయి సేవలు అందిస్తున్నారు. రైతులను సిబ్బందికి సమన్వయం చేసేందుకు వలంటీర్లను ప్రభుత్వం ఏర్పాటుచేసింది.

– పంజా కాశీ ప్రసాదు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్

లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

భీమడోలు: మూడేళ్లుగా విద్యుత్ లో ఓల్టేజీ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచి విద్యుత్ వెతలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం భీమడోలు ఏఈ పి.రామస్వామికి భీమడోలు ఉపసర్పంచ్ ఇనపాల సాయి, వైసీపీ నాయకులు, పెద్దలు వినతిపత్రం అందించారు. భీమడోలులోని ఐదో వార్డుకు చెందిన ప్రజలకు భీమడోలు లక్ష్మయ్య మిల్లు వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కొన్నేళ్లుగా ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ చాలకపోవడంతో లో ఓల్టేజీ సమస్య వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, తరచూ విద్యుత్ ఉపకరణాలు ధ్వంసమవుతున్నాయన్నారు. అక్కడ అదనంగా 40 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని వారు విన్నవించుకున్నారు. ఉపసర్పంచ్ ఇనపాల సాయి, వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు, మాజీ ఉపసర్పంచ్ బొమ్ము గాంధీ, కృష్ణమూర్తి, డి.సత్యనారాయణ, కఠారి బాబూరావు, వై.సూర్య భానుమతి తదితరుల పత్రాన్ని అందించారు. దీనిపై ఏడీఈ కె.గోపాలకృష్ణను వివరణ కోరగా పరిశీలిస్తామని, అవసరమైతే కెపాసిటీ పెంచి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

80 శాతం జగనన్న విద్యాకానుక పంపిణీ

దెందులూరు: మండలంలో 80 శాతం జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ పూర్తయిందని దెందులూరు మండల విద్యాశాఖాధికారి-1 సీహెచ్ బుద్ధావ్యాస్ అన్నారు. ఆదివారం దెందులూరు ఎంఈఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యాసంవత్సరం ప్రారంభించిన రోజునే ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అందజేసిన కానుకను విధిగా అందజేయాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సరఫరా, పంపిణీ సంతృప్తికర్తంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సహాయ సహకారాలతో విజయవంతమైందన్నారు. మిగిలిన 20 శాతం రెండు రోజుల్లో అన్ని పాఠశాలల్లో పంపిణీ చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సమన్వయంతో పని చేయాలని విద్యాశాఖాధికారి బుద్ధావ్యాస్ సూచించారు. పంపిణీ వివరాలను ఆన్‌లైన్‌లో పొందపర్చామన్నారు.

బంగారు భవిష్యత్తుకు పుస్తక పఠనం సోపానం



భీమదోలు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న చిన్నారులు

భీమడోలు: చిన్నారుల బంగారు భవిష్యత్తుకు పుస్తక పఠనం సోపానమని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని పుస్తక పఠనం చేసారు. భీమడోలు గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన బాలబాలికలు పాల్గొని సామూహిక పుస్తక పఠనం చేసారు. చిన్నారులు కథలు, జీవిత చరిత్రలు, దినపత్రికలు చదివారు. ఈ సందర్భంగా చిన్నారులకు తెలియని పరీక్ష అనే నీతి కథను చిన్నారులు తెలిపారు. ఏటా జూన్ మూడో ఆదివారం వచ్చే ఫాదర్స్ డే విశిష్టతను చిన్నారులకు వివరించారు. చిన్నారులు వారు చదువుకున్న నీతి కథలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథపాలకులు డీఎస్‌బీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు, పాఠకులు పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు ఎంఈవో-2గా పదోన్నతి



దెందులూరు ఎంఈఓ-2 అన్నమ్మ



నల్లజర్ల ఎంఈఓ-2 భగవతీ దేవి

దెందులూరు: దెందులూరు మండల విద్యాశాఖాధికారి-2గా అన్నమ్మగా నియమితులయ్యారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేషన్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ద్వారకాతిరుమల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తూ ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో దెందులూరు ఎంఈఓ-2గా పదోన్నతిపై ఆమె వచ్చారు.

స్కూల్ అసిస్టెంట్ భగవతీదేవికి ఎంఈఓ-2గా పదోన్నతి

దెందులూరు: మండలంలోని కొవ్వలి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న భగవతి దేవి నల్లజర్ల ఎంఈఓగా నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లిఖితపూర్వక ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఈ నియామకం జరిగింది. భగవతీదేవిని హెచ్‌ఎం శర్మ, ఉపాధ్యాయులు, ఎండీఎం, పేరెంట్స్ కమిటీ అభినందించారు.

గాంధీ లేని లోటు తీరనిది

పెదపాడు: వైఎస్సార్ సీపీ సీనియర్ కార్యకర్త వేగిరెడ్డి మురళీమోహన్ గాంధీ లేని లోటు తీరనిదని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. బాపులపాడు మండలంలోని పెరికీడు గ్రామానికి చెందిన గాంధీ గుండెపోటుతో మరణించారు. ఆదివారం ఆయన భౌతిక కాయాన్ని ఆమె సందర్శించి నివాళులర్పించారు. పార్టీకోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన ప్రసాద్, వేగిరెడ్డి బాలాజీ పాల్గొన్నారు.

మూడు టిప్పర్ల సీజ్

పెదవేగి : జానంపేట పంచాయతీ ప్రకాష్ నగర్ నుంచి ఏలూరుకు మట్టిని అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లను సీజ్ చేశామని పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రకాష్‌నగర్ నుంచి మట్టిని ఏలూరుకు రాత్రి సమయంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నారు. దీనిపై వచ్చిన సమాచారంతో వాటిని స్వాధీనం చేసుకుని టిప్పర్లను సీజ్ చేయడంతోపాటు వాటి యజమానులైన ఏలూరుకు చెందిన తాళ్ల శ్రీనివాసరావు, కామన నాగేశ్వరరావుతోపాటు ముగ్గురు డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు.

రాజ్యాంగ పరిరక్షణకు బాధ్యత వహించాలి

ఏలూరు (టూటౌన్) : అత్యుత్తమైన మన రాజ్యాంగాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద యూటీఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ పీఠికలో మాకు మేము సమర్పించుకుంటున్న రాజ్యాంగం అని చెప్పడంలోనే రాజ్యాంగం గొప్పతనం ఉందన్నారు. 29 రాష్ట్రాలు కలిగి ఉండే ఫెడరల్ వ్యవస్థను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను కాపాడుకోవాలని కోరారు. ప్రశ్నించడం, భావ ప్రకటన స్వేచ్ఛ ద్వారా ప్రజలందరికి స్వాతంత్ర్యం ఉందని దీనిని భంగపరిచే వారి పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రశ్నను ప్రోత్సహించని సమాజం అభివృద్ధి చెందదన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి మాట్లాడుతూ బదిలీలు, ప్రమోషన్ సందర్భంగా టెక్నికల్ సమస్యల వల్ల ఇబ్బందికి గురైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణకు ఫ్యాప్టో చేసిన కార్యాచరణను విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో తాత్కాలిక జిల్లా కమిటీ నాయకత్వానికి కొన్ని మార్పులు చేశారు. ప్రస్తుత అధ్యక్షులు ఆర్ రవికుమార్‌ను జిల్లా అధ్యక్షులుగా, జిల్లా సహాధ్యక్షురాలిగా వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారిగా జీవి రంగమోహన్, జిల్లా కార్యదర్శిగా యంవి బేతాళరావు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బి.మోహన్‌రావు, ఆడిట్ కమిటీ సభ్యునిగా సీహెచ్ పిచ్చోడును ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో పలువురు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతి

ఏలూరు (టూటౌన్) : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేయాలని కోరుతూ పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లా శాఖలు వినతి పత్రం అందజేశాయి. విజయవాడలో ఆదివారం నిర్వహించిన ఒక కార్యక్రమంలో రెండు జిల్లాలకు చెందిన నాయకులు వినతి పత్రాలు అందజేశారు. ప్రధానంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న 9 ప్రధాన సమస్యలను రాష్ట్ర నాయకత్వం దృష్టికి తీసుకువెళ్లినట్లు నాయకులు తెలియజేశారు. ఈ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర నాయకత్వం సానుకూలంగా స్పందించిదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అధ్యక్షులు పి.ఆంజనేయులు, పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాన్ని ఆదుకున్న ఆరోగ్యశ్రీ



భీమడోలు బైపాస్ రోడ్డులో చెట్ల కింద వైఎస్ రాజశేఖరరెడ్డి చలివేంద్రం వద్ద ప్రయాణికులకు మజ్జిగ పోస్తున్న వైఎస్సార్ అభిమాని రేవడ శ్రీనివాస్



మండుటెండల్లో దాహార్తిని తీర్చుకుంటున్న ప్రయాణికులు, భక్తులు

- వైఎస్సార్ కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకుని సేవాకార్యక్రమాలు
- వందలాది మంది ప్రయాణికులకు రేవడ శ్రీనివాస్ మజ్జిగ పంపిణీ

భీమడోలు: ఆ కుటుంబానికి ఆరోగ్యశ్రీ ప్రాణం పోసింది. దీంతో ఆ కుటుంబం దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డిని, అతని తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గుండెల్లో పెట్టుకున్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల గుండెల్లో కొలువైన వైఎస్సార్ కుటుంబాన్ని స్ఫూర్తిగా తీసుకుని రేవడ శ్రీనివాస్ భీమడోలులో 40 రోజులుగా ప్రయాణికులు మజ్జిగ పంపిణీ చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. భీమడోలు పంచాయతీ శివారు అరుంధతీకి చెందిన వైఎస్సార్ అభిమాని రేవడ శ్రీనివాస్ తన వంతుగా రాజన్న పేరుతో ప్రజా సేవ చేయాలని నిర్ణయించారు. ఈ ఏడాది మండుటెండల్లో భీమడోలు నుంచి ద్వారకాతిరుమల వెళ్లే భక్తులు, బాటసారులు ప్రజలకు చల్లని మజ్జిగను అందించాలని సంకల్పించారు. భీమడోలు బైపాస్ రోడ్డుపై వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమాని పేరుతో వెంటనే మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని ఏర్పాటు చేసారు. ఆటోలు, బైక్‌లు, భారీ వాహనాల్లో వెళ్లే వందలాది మందికి దాహార్తి తీరుస్తున్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమాని చల్లివేంద్రం పేరుతో మండుటెండల్లో రోడ్డుపై రోజుకు రూ.1,500 నుంచి రూ.2వేలు వెచ్చించి వందలాది మందికి చల్లని మజ్జిగను అందించి దాహార్తి తీర్చుతూ వారి దీవెనలందుకుంటున్నాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో నా భార్య రేవడ నాగమణి అనారోగ్యంతో బాధపడినప్పుడు ఆరోగ్య శ్రీ పథకంలో రూ.4లక్షలతో ఉచితంగా వెన్ను పూసకు ఆపరేషన్ చేయించారు. నాకు నాలుగేళ్ల క్రితం గుండెకు సంబంధించి నాలుగు వాల్వ్‌లు మూసుకుపోవడంతో జగనన్న ప్రభుత్వంలో రూ.5 లక్షలతో గుండెకు ఆపరేషన్ చేసారు. తాను నిత్యం ముగ్గు అమ్ముకుని దాని ద్వారా వచ్చే ఆదాయంతో జీవిస్తున్నానన్నారు. వైఎస్ రాజన్న, జగనన్నలు లేకుంటే మేము ప్రాణాలతో బతికి ఉండేవారం కాదని, వారు అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకం మాలాంటి నిరుపేదలకు వరంగా మారిందని రేవడ శ్రీనివాస్, నాగమణి తెలిపారు. ఏటా మా ఏరియాలో కొంత మందికి మజ్జిగను అందించేవాడినని, ఈ ఏడాది రాష్ట్రీయ రహదారిపై మజ్జిగ క్యాన్లు పెట్టుకుని రహదారిపై రాకపోకలు సాగించే వారికి మజ్జిగను పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. పలువురు వ్యక్తులు నా పేదరికాన్ని గుర్తించి పలు సార్లు పంపిణీకి అవసరమైన మజ్జిగ క్యాన్లు ఇచ్చారన్నారు. ఎవరు ఇచ్చినా ఇవ్వకపోయినా నా కష్టార్జితంతో మజ్జిగను అందించి ప్రజల ఆదరాభిమానాలు పొందానని తెలిపారు. ఈ కార్యక్రమం మాకు ఎంతో సంతృప్తినినిస్తుందని రేవడ శ్రీనివాస్ పేర్కొన్నారు.

నేడు ఎనికేపల్లిలో గడపగడపకు..

నిడమర్రు: అడవికొలను గ్రామ సచివాలయం పరిధిలోని ఎనికేపల్లిలో సోమవారం సాయంత్రం 5గంటల నుంచి గడపగడపకు మన ప్రభుత్వం (170వ రోజు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు హాజరై మూడేళ్లలో ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను లబ్ధిదారులకు వివరిస్తారన్నారు. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకూ అధికారులు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరవ్వాలని కోరారు.

212 మందికి వైద్యసేవలు



పోతునూరు పాఠశాలలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్

దెందులూరు: పోతునూరు ఉన్నత పాఠశాలలో ఆదివారం సీఆర్‌రెడ్డి మహిళా కళాశాల ఆధ్వర్యంలో ఫ్రీ మెగా మెడికల్ క్యాంప్ జరిగింది. క్యాంపును సర్పంచ్ బోదుల స్వరూప్ ప్రారంభించారు. గుండె, స్త్రీ, దంత, ముక్కు, గొంతు, కంటి, సాధారణ వ్యాధులు, చర్మవ్యాధులకు సంబంధించి 212 మందికి పోతునూరుతో పాటు సమీప గ్రామాల్లోని ప్రజలకు డాక్టర్ దామోదర్ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరరావు, డాక్టర్ తేజస్వి, డాక్టర్‌సదాశివరావు, డాక్టర్ వాణి, డాక్టర్ బసవరాజు, డాక్టర్ నిర్మలాదేవి, డాక్టర్ సీతారామప్రసాద్, డాక్టర్ రితేష్ వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. రెడ్డి కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు ఉన్నత్ భారత్ అభియాన్, కాలేజీ రోటరాక్ట్ క్లబ్ సహకారంతో ఉన్నత పాఠశాలలో ఫ్రీ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించారని పోతునూరు గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకున్న నేపథ్యంలో సేవా కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించినట్టు సర్పంచ్ వివరించారు.

జూదరుల అరెస్టు

పెదవేగి : కూచిపూడిలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడిచేసి, నలుగురు జూదరులను అరెస్టు చేశామని ఎస్సై లక్ష్మణ్ ఆదివారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1,550 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మరో ఘటనలో రాయన్నపాలెంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,400 నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు. రాయన్నపాలెంలో కోడిపందేల స్థావరంపై దాడిచేసి, నలుగురిని అరెస్టు చేశామని ఎస్సై చెప్పారు. వారివద్ద నుంచి రూ.1,500 నగదు, కోడిపుంజును స్వాధీనం చేసుకున్నామని ఎస్సై లక్ష్మణ్ తెలిపారు.

ఉమామహేశ్వరరావుకు నివాళి

ఏలూరు (టూటౌన్) : సీపీఐ సీనియర్ నాయకులు, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఏఐవైఎఫ్ నాయకులు బోగా ఉమామహేశ్వరరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ఏలూరు నగరంలో సీపీఐ పార్టీ, ప్రజానాట్యమండలి, యువజన సమాఖ్యలను నిర్మాణం చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ మిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక 36వ డివిజన్ భగత్ సింగ్ స్మారక గ్రంథాలయం వద్ద ఆదివారం ఉమామహేశ్వరరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక డివిజన్ సీపీఐ శాఖ కార్యదర్శి కడుపు కన్నయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు ఆశయాలను కొనసాగిస్తామన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రెడ్డి శ్రీనివాస డాంగే, సీపీఐ నాయకులు గేదెల నాగేశ్వరరావు, పోలా భాస్కర్, ఆర్ పెద్దిరాజు, బేతా శంకర్, సీహెచ్ సుబ్రహ్మణ్యం, యర్రా నాగేశ్వరరావు, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
దెందులూరు, ఉంగుటూరు
9912220559
90102 23729
63097 62918
Office mail : tpgadvt@gmail.com